క్లుప్తంగా

ఏఎన్‌యూ విద్యార్థుల ఫారెస్ట్ స్టడీ టూర్




ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ ఎమ్మెస్సీ ఫారెస్ట్రీ విభాగం విద్యార్థులు ఫారెస్ట్ స్టడీ టూర్‌ను పూర్తి చేశారు. స్టడీ టూర్‌లో భాగంగా విద్యార్థులు రాజమహేంద్రవరం, రంపచోడవరం మారేడుమిల్లి, సెంట్రల్ టుబాకో రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, కోరింగ్ వైల్డ్ లైఫ్ సంక్చరీలను సందర్శించి ప్రకృతి పరిరక్షణ, వన్యప్రాణుల సంరక్షణ, పర్యావరణ సంబంధించిన అంశాలను పరిశీలించినట్లు విభాగాధిపతి ఆచార్య కె.మల్లికార్జున తెలిపారు. స్టడీ టూర్ వివరాలను ఆయన సోమవారం వీసీ ఆచార్య కె.గంగాధరరావుకు అందజేశారు. అరణ్య పరిసరాలు, వాటి సంరక్షణ, వన్యప్రాణుల జీవన విధానం, మానవ సంబంధాలపై టూర్‌లో అవగాహన కల్పించడం జరిగిందన్నారు. అరణ్య ప్రాంతాలపై జరుగుతున్న పరిశోధనలు, పర్యావరణ సంరక్షణ చర్యలు, జంతు సంరక్షణ, హైటెక్ నర్సరీలు, ఎకోటూరిజం వంటి అంశాలను విద్యార్థులు క్షేత్రస్థాయిలో అధ్యయనం చేశారన్నారు. సందర్శించినట్లు మల్లికార్జున తెలిపారు.

వైద్య కళాశాలలో రీడింగ్ రూము ప్రారంభం



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో వైద్యవిద్యార్థులు చదువుకునేందుకు ఆధునికీకరించిన రీడింగ్ రూమును సోమవారం వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారి ప్రారంభించారు. ఇటీవల కాలంలో రీడింగ్ రూము ఎలక్ట్రిక్ షార్ట్ సర్క్యూట్ వలన కాలిపోయింది. సుమారు రెండు నెలలుగా వైద్య విద్యార్థులు కళాశాలలో చదువుకునేందుకు రీడింగ్ రూము లేక అవస్థలు పడుతున్నారు. నవంబరు 1న ప్రిన్సిపాల్‌గా చార్జి తీసుకున్న డాక్టర్ సుందరాచారికి వైద్య విద్యార్థులు రీడింగ్ రూము సమస్య గురించి ఫిర్యాదు చేశారు. సమస్య తెలుసుకున్న రెండు రోజుల్లోనే ఆయన దానిని ఆధునికీకరించి విద్యార్థులు చదువుకునేందుకు ఏర్పాటు చేశారు. దీంతో సోమవారం ప్రిన్సిపాల్‌ను వైద్య విద్యార్థులు సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ప్రభాకర్, డాక్టర్ శ్రీధర్ పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరుద్రహోమం



నగరంపాలెం: స్థానిక మారుతీ నగర్‌లోని శ్రీ కంచి కామకోటి పీఠ శ్రీమారుతి దేవాలయ ప్రాంగణంలో కార్తిక మాస మహోత్సవాల్లో భాగంగా సోమవారం మాన్యాస ఏకాదశి రుద్రాభిషేకాలు, సహస్ర మృత్తికా లింగార్చన కార్యక్రమాలు సందర్భంగా శ్రీరుద్ర హోమం నిర్వహించారు. కార్యదర్శి తంగిరాల శ్రీనివాస్ పర్యవేక్షించారు.

హెచ్ఐవీ ఎయిడ్స్‌పై ఫ్లాష్‌మాబ్



గుంటూరు ఎడ్యుకేషన్: హెచ్ఐవీ ఎయిడ్స్‌కు వ్యతిరేకంగా యువతరం సమాజాన్ని ఫ్లాష్ మాబ్‌తో చైతన్యపర్చే ప్రయత్నం చేశారు. సోమవారం జేకేసీ కళాశాల ఎన్ఎస్ఎస్, రెడ్ రిబ్బన్ క్లబ్, ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు హెచ్ఐవీ ఎయిడ్స్ నియంత్రణపై కళాశాల నుంచి గుజ్జనగుండ్ల సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎయిడ్స్‌తో కలిగే అనర్థాలు, సమాజంలో చోటు చేసుకుంటున్న పరిణామాలను వివరిస్తూ విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ ద్వారా ప్రదర్శన ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ మాట్లాడుతూ హెచ్ఐవీ ఎయిడ్స్‌పై సమాజంలో అనేక అపోహలు ఉన్నాయని, దీని నియంత్రణకు అనేక మార్గాలను సూచిస్తూ సమాజాన్ని చైతన్య పర్చేందుకు తమ కళాశాల విద్యార్థులు ఫ్లాష్‌మాబ్ ప్రదర్శించారని తెలిపారు.

పేర్ని నాని ప్రశ్నకు పవన్ సమాధానం చెప్పాలి

లక్ష్మీపురం: కాకినాడ పోర్ట్ వ్యవహారంపై వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పటం ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బాధ్యతగా తీసుకోవాలని కమ్యూనిస్టు ఇండియా జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వర రావు(సంగమ్) సోమవారం ఒక ప్రకటనలో కోరారు. సమాజానికి కావాల్సింది స్పష్టత అని తెలిపారు.

ప్రజల పక్షాన పోరాటానికి వెనుకాడం

మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి



సమావేశంలో మాట్లాడుతున్న అంబటి రాంబాబు

పట్నంబజారు: కూటమి ప్రభుత్వం చేస్తున్న అక్రమాలపై పోరాటాలను మరింత ఉధృతం చేయాల్సిన అవసరం ఉందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబు పిలుపునిచ్చారు. బృందావన్‌గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో పార్టీ జిల్లాలోని నియోజకవర్గాల సమన్వయకర్తల సమావేశం సోమవారం నిర్వహించారు. సమావేశంలో భాగంగా ఆయా ప్రాంతాల సమస్యలు, స్థానికంగా ఏర్పడిన రాజకీయ పర్యవసానాలపై చర్చించారు. కూటమి నేతలు వ్యవహరిస్తున్న తీరు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలను ఇబ్బందులకు గురి చేస్తున్న అంశాలను ప్రస్తావించారు. ఈ సందర్భంగా అంబటి రాంబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు ఆరు నెలలు గడుస్తున్నా... కనీసం ప్రజలకు ఒక్క మేలు చేసిన పాపాన పోలేదని ధ్వజమెత్తారు. ఇదేమని ప్రశ్నిస్తే అక్రమ కేసులు, అరెస్టులతో పార్టీ కార్యకర్తలతో పాటు, సోషల్ మీడియా యాక్టివిస్టలను కూడా భయపెట్టేందుకు ఏ మాత్రం వెనుకాడటంలేదని విమర్శించారు. ఇటువంటి కేసులకు, తాటకు చప్పుళ్లకు వైఎస్సార్ సీపీ శ్రేణులు ఒక్క అడుగు కూడా వెనక్కి వేయరన్న విషయాన్ని గుర్తించాలని కోరారు. రాబోయే రోజుల్లో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా, ప్రజల పక్షాన ఎంతటి పోరాటినికి వెనుకాడని విధంగా కార్యకర్తలను సన్నద్ధం చేయాలని సమన్వయకర్తలకు సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు, డెప్యూటీ మేయర్, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు(డైమండ్), తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరిఫాతిమా, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ పాల్గొన్నారు.

సమస్యలను త్వరితగతిన పరిష్కరించండి

అదనపు కమిషనర్ ఓబులేసు



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న అదనపు కమిషనర్ ఓబులేసు

పట్నంబజారు: వివిధ సమస్యలతో ప్రజలు అందించే అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, వాటిని సమగ్రంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ ఓబులేసు ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కమిషనర్ చాంబర్‌లో డయల్ యువర్ కమిషనర్, కౌన్సిల్ హాలులో పీజీఆర్ఎస్‌ని నిర్వహించారు. తొలుతగా అదనపు కమిషనర్ ఓబులేసు డయల్ యువర్ కమిషనర్ ద్వారా ప్రజల నుంచి అందిన 15 ఫిర్యాదుల స్వీకరించారు. అనంతరం వాటిని ఆయా సంబందింత అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ప్రజల నుంచి అందే అర్జీల్లో తక్షణం పరిష్కారం చేయగలిగినవి, కొంత సమయం తర్వాత చేయగలిగినవి వేరువేరుగా లిస్టు తయారు చేయాలన్నారు. డయల్ యువర్ కమిషనర్‌కి అందిన అర్జీల పరిష్కారానికి ఆయా విభాగ ఇన్‌చార్జిలే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలని కోరారు. అనంతరం కౌన్సిల్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్ కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. నగర ప్రజల నుంచి అందే అర్జీలను నిర్దేశిత గడువులోగా పరిష్కారం చేయాలన్నారు. పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, రోడ్ల ఆక్రమణ వంటి సమస్యలను స్థానికంగానే పరిష్కారించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. పరిష్కారం అనంతరం ఫిర్యాదికి సమాచారం తెలియచేయాలని ఆదేశించారు. పీజీఆర్ఎస్‌కు సోమవారం 28 ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి 9, ఇంజినీరింగ్ విభాగంలో 8, రెవెన్యూ విభాగం 6, పరిపాలన విభాగం 2, ప్రజారోగ్య విభాగం 2, ఉపా సెల్ కి సంబంధించి 1 ఫిర్యాదు అందాయని వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అదనపు కమిషనర్ ఓబులేసు ఆదేశించారు. కార్యక్రమంలో డెప్యూటీ కమిషనర్లు సిహెచ్.శ్రీనివాస్, డి.శ్రీనివాసరావు, టి.వెంకట కృష్ణయ్య, ఎస్.ఈ. నాగమల్లేశ్వరరావు, సిటీప్లానర్ రాంబాబు, ఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు, మేనేజర్ బాలాజీ బాషా పాల్గొన్నారు.

హేతుబద్ధంగా లేని వంద రోజుల యాక్షన్ ప్లాన్

గుంటూరు ఎడ్యుకేషన్: ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో అధిక ఉత్తీర్ణత సాధించేందుకు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విడుదల చేసిన వంద రోజుల యాక్షన్ ప్లాన్ హేతుబద్ధంగా లేదని ఏపీటీఎఫ్ గుంటూరు జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.బసవలింగారావు, మహమ్మద్ ఖాలీద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వంద రోజుల తరగతుల నిర్వహణలో ఆదివారాలు తప్పనిసరిగా పాఠశాలకు రావాలని చెప్పడం, ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు తరగతులు నిర్వహించడం, ఉపాధ్యాయులపై అధిక భారం మోపడమేనని ఆరోపించారు. సంక్రాంతి సెలవుల్లో పాఠశాలలు నిర్వహించాలని షెడ్యూల్ ఇవ్వడంతో పాటు ఉపాధ్యాయులను గైడ్ చేయమని ఊపిరాడని విధంగా చేయడం తగదన్నారు. మిగిలిన రోజుల్లో ఉదయం 8.00 గంటల నుంచి సాయంత్రం ఐదు వరకు మొత్తం 9 గంటల బోధన ఉండటం ప్రపంచంలోని అభివృద్ధి చెందిన దేశాల్లో కూడా లేదన్నారు. మన రాష్ట్రంలో ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా వ్యాపార ధోరణితో నడుపుతున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో మినహా దేశంలో ఎక్కడా ఈవిధంగా లేదన్నారు. ప్రైవేటు పాఠశాలలను నియంత్రించాల్సిన విద్యాశాఖ అధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో అశాస్త్రీయమైన విధానాలు అమలు చేయాలని చూడడం సరైనది కాదన్నారు. తక్షణమే దీనిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

శరవేగంగా సాంకేతిక, డిజిటల్ విప్లవం



ప్రదర్శన తిలకిస్తున్న కృష్ణప్రసాద్, రత్తయ్య

గుంటూరు ఎడ్యుకేషన్: సాంకేతిక, డిజిటల్ విప్లవం దిశగా ప్రపంచం వేగంగా అభివృద్ధి చెందుతోందని డాక్టర్ కేఎల్పీ పబ్లిక్ స్కూల్ కరస్పాండెంట్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. జేకేసీ కళాశాల రోడ్డులోని కేఎల్పీ స్కూల్లో సోమవారం ప్రపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా సాంకేతిక, డిజిటల్ రంగాల సమాహారంగా విద్యార్థులతో కంప్యూటర్ల ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రజలందరికీ సాంకేతిక రంగంపై అవగాహన పెంచాల్సిన అవసరముందన్నారు. ప్రిన్సిపాల్ జి.రత్తయ్య మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యార్థులకు కళాశాలల్లో బోధిస్తున్న పైథాన్ లాంగ్వేజ్‌ను పాఠశాల స్థాయిలోనే ప్రవేశపెట్టామని చెప్పారు. ఈసందర్భంగా కంప్యూటర్‌లో ఎండోమెంట్ ప్రైజ్ ఏర్పాటు చేశారు. పైథాన్ ప్రోగ్రాంలో టెస్ట్ విద్యార్థి పి.తన్మయ్ ప్రథమ బహుమతి సాధించాడు. నాలుగు హౌస్‌ల వారీగా నిర్వహించిన క్విజ్ పోటీల్లో ప్రధ్వీ విభాగంలో రత్నప్రకాష్, మనస్విని, హేమన్, సాత్విక, ఉత్తేజ్‌రెడ్డి ప్రథమ బహుమతి, ఆకాష్ విభాగం నుంచి మోక్షఫణి, రామ్ తనయ, భార్గవ్, మనోజ్ఞ, పూజిత ద్వితీయ బహుమతి గెలుపొందారు. డిజిటల్ డ్రాయింగ్‌లో చక్రధర్, ఎక్సెల్‌లో బందిత, ఎంఎస్ యాక్సెస్‌లో తుల్యశ్రీ, సెమినార్‌లో వి.వైష్ణవి ప్రథమ స్థానంలో నిలిచారు. ఈసందర్భంగా విద్యార్థులను పాఠశాల వ్యవస్థాపకుడు డాక్టర్ కె.బసవపున్నయ్య, నాగార్జున ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్ అభినందించారు.

భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థినులను అభినందిస్తున విష్ణువర్ధన్, వరప్రసాదరావు, కృష్ణవేణి

గుంటూరు ఎడ్యుకేషన్: భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీల్లో శ్రీపాటిబండ్ల సీతారామయ్య హైస్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. లక్ష్మీపురంలోని పాఠశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో విష్ణువర్ధన్ మాట్లాడుతూ చిన్మయ మిషన్ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన పోటీల్లో తమ పాఠశాల ఏడో తరగతి విద్యార్థిని ఎం.దర్శిని ద్వితీయ బహుమతి, ఆరో తరగతి విద్యార్థిని ఆర్ఎన్‌కే శ్రియాన్వి తృతీయ బహుమతులు సాధించారని తెలిపారు. సంస్కృతి, సంప్రదాయాలను పెంపొందించే విధంగా ఇటువంటి పోటీలకు విద్యార్థులను ప్రోత్సహిస్తూ, వారిలో సృజనాత్మకతను పెంపొందించేందుకు దోహదం చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో పాలకవర్గ సభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, ప్రిన్సిపాల్ జంపని పద్మజ, ప్రైమరీ ప్రిన్సిపాల్ కర్లపూడి పార్వతీదేవి, కో–ఆర్డినేటర్లు దుర్గాశ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.

చలపతి ఫార్మసీ కళాశాలలో చదరంగం శిక్షణ శిబిరం

ప్రత్తిపాడు: ఆచార్య నాగార్జున యూనివర్సిటీ చదరంగం జట్టుకు శిక్షణ శిబిరాన్ని గుంటూరు రూరల్ మండలం లాం చలపతి ఫార్మసీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు సోమవారం ప్రారంభించారు. విశాఖపట్నం గీతం యూనివర్సిటీలో ఈ నెల 6వ తేదీ నుంచి 8 వరకు నిర్వహించనున్న సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో పాల్గొనే జట్టుకు నాలుగో తేదీ వరకు శిక్షణ ఉంటుందని కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వై.వి.రాఘవయ్య తెలిపారు. గత నెల 19, 20 తేదీల్లో చలపతి ఫార్మసీ కళాశాల వేదికగా నిర్వహించిన అండర్ విశ్వవిద్యాలయ చదరంగం పోటీలలో గెలుపొందిన విజేతలకు కూడా నాలుగో తేదీ వరకు ఎం.గోపీనాథ్ శిక్షణ ఇస్తారని చెప్పారు. జేకేసీ కాలేజీ నుంచి ఎస్.వైష్ణవి, చలపతి ఫార్మసీ కళాశాల నుంచి బి.సాయి తేజ, బాపట్ల ఇంజినీరింగ్ కళాశాల నుంచి ఎస్.మేరీ, సి.హెచ్.అనూష, చలపతి ఫార్మసీ కళాశాల నుంచి ఆర్.నాగవైష్ణవి, కె.స్వప్న మాధురి శిక్షణ పొందుతున్నారు.

పీడియాట్రిక్స్ ప్రొఫెసర్‌గా డాక్టర్ ఎలిజిబెత్

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల పిల్లల వైద్య విభాగం ప్రొఫెసర్‌గా డాక్టర్ బి.ఎలిజిబెత్‌ను నియమిస్తూ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి డాక్టర్ మంజుల డీ హోస్మని సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఈమె ఒంగోలు గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో విధులు నిర్వహిస్తున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో ప్రొఫెసర్ పోస్టు ఖాళీ ఉండటంతో గుంటూరుకు ఆమె రిక్వెస్ట్‌పై బదిలీ చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

మద్యం తరలిస్తున్న వ్యక్తి అరెస్టు

పట్నంబజారు: నిబంధనలకు విరుద్ధంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచారు. గుంటూరు– 2 సీఐ ఎం.యశోదదేవి తెలిపిన వివరాలు.. హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన దామర్ల ఉమామహేశ్వరరావు డిఫెన్స్‌కు సంబంధించిన మద్యం బాటిళ్లు కలిగి ఉన్నట్లు పక్కా సమాచారం అందుకున్న ఎక్సైజ్ పోలీసులు సోమవారం అతడి ఇంటి వద్ద దాడిచేసి పట్టుకున్నారు. 25 మద్యం బాటిళ్లు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరుస్తున్నట్లు తెలిపారు.

ముగ్గురు గంజాయి నిందితుల అరెస్ట్



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న తెనాలి డీఎస్పీ జనార్ధనరావు

చేబ్రోలు: కాలేజీలలో చదువుతున్న విద్యార్థులు, యువత గంజాయి, డ్రగ్స్ వంటి వాటికి దూరంగా ఉండాలని, మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని తెనాలి డీఎస్పీ బి.జనార్ధనరావు అన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో గంజాయి కేసు వివరాలను వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ భవనేశ్వర్ ప్రాంతానికి చెందిన ప్రహ్లదానంద దాస్, ప్రసనరౌత్రే, కాండియా హట్ ప్రాంతానికి చెందిన జడజెనాలు చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ పరిధిలోని కామధేను ఫీడ్స్ కంపెనీ సమీపంలోని ఖాళీ ప్రదేశం వద్ద అనుమానాస్పదంగా సంచులతో కనిపించారు. ముగ్గురు నిందితులు పోలీసుల రాకను గమనించి పారిపోవటానికి ప్రయత్నించారు. పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ డి.వెంకటకృష్ణ, సిబ్బంది అదుపులోకి తీసుకొని వారిని విచారించారు. నిందితులు స్పిన్నింగ్ మిల్లులలో కార్మికులు, కూలి పనులు చేసుకొని జీవిస్తూ, గంజాయికి అలవాటు పడి, సులభంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయిని అక్రమ రవాణా చేస్తున్నారు. ఒరిశా నుంచి తీసుకువచ్చిన 4.2 కిలోల గంజాయిని చిన్న చిన్న పొట్లాలుగా చేసి చేబ్రోలు, తెనాలి మండలంలోని కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు, స్పిన్నింగ్ మిల్లులలో పనిచేసే కార్మికులకు, నిరుద్యోగ యువతకు గంజాయి పొట్లాలు అమ్మి ఎక్కువ మొత్తంలో డబ్బులు సొమ్ము చేసుకుంటున్నారు. నిందితులు ఒరిశా రాష్ట్రంలో గుర్తు తెలియని వ్యక్తి నుంచి పది వేల రూపాయలకు 4.2 కిలోల గంజాయిని రోడ్డు, రైలు మార్గాల ద్వారా నారాకోడూరుకు తీసుకువచ్చి, దీపక్ దగ్గర ఉంచారు. నిందితులు గంజాయిని వాటాలు చేసుకొని విక్రయించటానికి సిద్ధమవుతున్న తరుణంలో పోలీసులకు పట్టుబడ్డారు. గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుల అరెస్ట్‌లో ప్రతిభ చూపిన పొన్నూరు రూరల్ సీఐ వై.కోటేశ్వరరావు, చేబ్రోలు ఎస్ఐ డి.వెంకటకృష్ణ, సిబ్బందిని డీఎస్పీ జనార్ధనరావు అభినందించారు.

అధ్యాపకుల కృషి అభినందనీయం



సుధీర్‌కుమార్‌ను అభినందిస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యాబోధనతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో ఉత్సాహంగా సేవలందించడం ద్వారా అధ్యాపకులు విశేష కృషి చేస్తున్నారని టీజేపీఎస్ కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం పేర్కొన్నారు. పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాలలో తెలుగు అధ్యాపకుడు, గుంటూరు జిల్లా జాతీయ సేవా పథక నిర్వహణ అధికారిగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ జేవీ సుధీర్ కుమార్‌కు జిల్లావైద్యారోగ్యశాఖాధికారి విజయలక్ష్మి నుంచి ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్న సందర్భంగా కళాశాలలో అభినందించారు. ప్రపంచ ఎయిడ్స్ నియంత్రణ దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించినందుకు పురస్కారం అందుకున్నట్లు వివరించారు. ఈసందర్భంగా కళాశాల పాలకమండలి అధ్యక్షుడు పోలిశెట్టి శ్యాం సుందర్, కమిటీ సభ్యుడు నాగ సుందరం, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, వైస్ ప్రిన్సిపాల్ భానుమురళి, అధ్యాపకులు పాల్గొని సుధీర్‌కుమార్‌ను అభినందించారు.

జైపూర్‌లో కమిషనర్ పర్యటన



పలు పరికరాల పనితీరును పరిశీలిస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

పట్నంబజారు: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాజస్తాన్ రాష్ట్రంలోని జైపూర్ మున్సిపల్ కార్పొరేషన్‌లో వీధి దీపాల పర్యవేక్షణ వ్యవస్థ, రోడ్ల నిర్వహణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, ద్రవ వ్యర్థాల నిర్వహణ, ఇతర ఉత్తమ పద్ధతులు అమలుకు సంబంధించి రెండు రోజుల స్టడీ టూర్‌లో భాగంగా సోమవారం జైపూర్ డెహ్లావాస్‌లోని 215 ఎంఎల్డీ సామర్థ్యం కలిగిన మురుగునీటి శుద్ధి ప్లాంట్ నిర్వహణ, పనితీరును గుంటూరు కార్పొరేషన్ నగర కమిషనర్ పులి శ్రీనివాసులు పరిశీలించారు. అనంతరం ప్లాంట్ పరిసరాలను, ప్లాంట్‌కి సంబంధించిన చారిత్రిక మ్యూజియాన్ని సందర్శించారు. మురుగునీటిని శుద్ధి అనంతరం పునర్వినియోగ విధానాన్ని పరిశీలించారు. సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్ ఆధారంగా భారతదేశంలో మొట్ట మొదటి బయోగ్యాస్ ప్లాంట్‌ని పరిశీలించారు. మురుగునీటి పంపింగ్ స్టేషన్, ప్రాథమిక చికిత్స యూనిట్లు, స్లడ్జ్ విభజన యూనిట్ల పనితీరు స్పష్టంగా చూసి తెలుసుకున్నారు. సోలార్ పవర్ ప్లాంట్, సీఎన్జీ బ్లాటింగ్ పాయింట్‌లను పరిశీలించారు. వీధి దీపాల నిర్వహణను ప్రాజెక్ట్ ఈఈ ప్రదీప్ వివరిస్తూ జైపూర్ నగరంలో 1,19,3333 వీధి లైట్లు ఉన్నాయని, వాటిని 1697 సెంట్రల్ కంట్రోల్ మానిటరింగ్ సిస్టం ద్వారా పర్యవేక్షణ చేస్తామని తెలిపారు. వాటి వివరాలను పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. అలాగే గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జీటీఎస్) కేంద్రాలను ప్రత్యేకంగా పరిశీలించి, ఏర్పాటు చేసిన ప్రాంతం, ప్రతి రోజు వ్యర్థాలు ఎంత వస్తుంది, వాటిని జీటీఎస్‌కి, అక్కడి నుంచి డిస్పోజ్ పాయింట్‌కి తరలించే విధానం, పరిసరాల నిర్వహణను నేరుగా పరిశీలించారు. చెత్తను అధునాతన విధానంలో మెకానికల్ కన్వేయర్ బెల్ట్ ద్వారా తడి, పొడిగా వేరు చేయడాన్ని పరిశీలించారు. నివాస ప్రాంతాల్లో దుర్వాసన లేకుండా జీటీఎస్ పనితీరు ఉండడం గమనించారు. భవన నిర్మాణ వ్యర్థాల నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించి, కేంద్రానికి వ్యర్థాలను తరలించే తీరు, వసూలు చేస్తున్న చార్జీల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

వర్సిటీ అధికారులను కలిసిన వికాస నూతన కార్యవర్గం



ఆచార్య నాగార్జునుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వికాస నూతన కార్యవర్గ నాయకులు

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అధ్యాపకేతర సిబ్బంది సంఘం(వికాస) నూతన కార్యవర్గ నాయకులు సోమవారం వర్సిటీ ఉన్నతాధికారులను అధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. వీసీ ఆచార్య కే గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కే రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధిలో ఉద్యోగుల సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని వికాస నాయకులు ఉన్నతాధికారులకు పేర్కొన్నారు. తొలుత యూనివర్సిటీ ప్రధాన ద్వారం వద్ద ఆచార్య నాగార్జునుడి విగ్రహానికి, యూనివర్సిటీలోని జాతీయ నాయకులు, సంఘ సంస్కర్తల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వికాస అధ్యక్షుడు ఎస్.ప్రసాద్, ఉపాధ్యక్షుడు డి.విజయప్రకాష్ బాబు, ప్రధాన కార్యదర్శి జె.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులు టి.వెంకటేష్, ఎస్.నాగేశ్వరరావు, కోశాధికారి కె.యేషయ్య, కార్యవర్గ సభ్యులు సీహెచ్ ఆనంద్ కుమార్, పి.నాగరాజు, సిహెచ్.సాంబశివరావు, కె.శశిధర్, జి.శ్రీను, ఎస్.శ్రీనివాసరావు, ఈ. శ్రీనివాసరెడ్డి, టి.వెంకటేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వర్లు ఉన్నారు. వర్సిటీ విభాగాలలో స్వీట్లు పంచి వికాస ఎన్నికలు ఏకగ్రీవం అయ్యేందుకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు.

వంట గ్యాస్‌కూ ఇన్సూరెన్స్



లక్ష్మీపురం: వంట గ్యాస్ వినియోగం ప్రతిఇంటిలో తప్పనిసరి. గ్యాస్ వినియోగదారులకు కంపెనీలు అనేక సదుపాయాలు కల్పిస్తున్నాయి. అందులో ప్రమాద బీమా ఒకటి. ప్రమాద తీవ్రతను బట్టి పరిహారం చెల్లించడం జరుగుతుంది.

పబ్లిక్ లైబిలిటి ఇన్సూరెన్స్ అంటే....

ఇంట్లో వంట గ్యాస్ సిలెండర్ పేలితే.. తక్షణమే ఆ సిలిండర్ కంపెనీ డిస్ట్రిబ్యూటర్‌కు విషయాన్ని తెలియజేయాలి. వారు సేల్స్ ఆఫీసర్ ద్వారా తహసీల్దార్, ఇన్సూరెన్స్ సర్వేయర్, అగ్నిమాపక శాఖ అధికారి ఇచ్చిన రిపోర్టు ఆధారంగా క్లెయిమ్ చేస్తారు. సిలిండర్ లీకేజీ అయినప్పుడు మాత్రమే క్లెయిమ్ అవుతుంది. ప్రమాదానికి సంబంధించిన పత్రాల వివరాలు ఏడు రోజుల్లోపు ఇన్సూరెన్స్ కంపెనీకి కచ్చితంగా అందాలి. ఈలోగా డిస్ట్రిబ్యూటర్ వంట గ్యాస్‌కు సంబంధించిన సిలెండర్‌ను రెగ్యులేటర్‌ను పైపును వినియోగదారుడి వద్ద డిపాజిట్ చేసుకుని అందించాలి.

ఎంత మొత్తం చెల్లిస్తారంటే...

గ్యాస్ లీకేజీ వలన ప్రమాదం జరిగి మృతి చెందితే సుమారు రూ.6 లక్షలు, గాయపడితే రూ.25 వేల నుంచి రూ.2 లక్షలు, ప్రమాదం జరిగిన సమయంలో గృహోపకరణాలు ప్రమాదం చోటు చేసుకున్న ఇల్లు డ్యామేజీ గురైై ఇన్సూరెన్స్ కంపెనీ సర్వేయర్ సర్వే రిపోర్ట్ సక్రమంగా ఉంటే రూ.2 లక్షలు అందిస్తారు. అలాగే వినియోగదారుడి ఇంట్లో గ్యాస్ లీకేజీ వల్ల చుట్టుపక్కల ఉండే నివాసాల్లో ప్రమాదం జరిగితే రూ.30 లక్షల వరకు ఇన్సూరెన్స్ వర్తిస్తుంది. వినియోగదారుడిపై అనుమానం వస్తే పోలీస్ విచారణ కూడా ఉంటుంది. ఇన్సూరెన్స్ కంపెనీవారు కోర్టులో కేసు వేసే అవకాశం కూడా ఉంది.

డిస్ట్రిబ్యూటర్‌కు ఇవ్వాల్సిన పత్రాలు....

సిలెండర్ పేలితే డిస్ట్రిబ్యూటర్‌కు తక్షణమే సమాచారం అందించాలి. కంపెనీ పుస్తకం, బుకింగ్ చేసుకున్న రసీదు, ప్రమాదం జరిగిన ఇంటి డోర్ నంబరు, అర్జీని సిద్ధం చేయడంతోపాటు డిస్ట్రిబ్యూటర్ వద్ద ఉండే ఇన్సూరెన్స్ క్లెయిమ్ అప్లికేషన్‌ను పూర్తి చేసి సంతకం పెట్టి అందించాలి.

పౌరసరఫరా శాఖకు సంబంధం లేదు...

వంట గ్యాస్ వినియోగదారుడికి జరిగిన ప్రమాదం గురించి గానీ, ఇన్సూరెన్స్ గురించి గానీ పౌరసరఫరాల శాఖకు ఎలాంటి సంబంధం ఉండదు. ఇదంతా వినియోగదారుడు, డిస్ట్రిబ్యూటర్ సేల్స్ ఆఫీసర్, ఇన్సూరెన్స్ కంపెనీ మధ్య జరిగే వ్యవహారం మాత్రమే..

కాలుష్య నియంత్రణపై సమాజాన్ని చైతన్యపర్చాలి



విద్యార్థులతో జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ గోపీచంద్, పర్యావరణ ఇంజినీర్ నజీమాబేగం

గుంటూరు ఎడ్యుకేషన్: కాలుష్య నియంత్రణపై విద్యార్థులు సమాజాన్ని చైతన్యపర్చాలని జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ పి.గోపీచంద్ పేర్కొన్నారు. సోమవారం జేకేసీ కళాశాలలో ఎకోక్లబ్, కాలుష్య నియంత్రణ మండలి సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ కాలుష్య నియంత్రణా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈసందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ కాలుష్య నియంత్రణ కోసం తమ వంతుగా కళాశాలలో ప్లాస్టిక్ బాటిళ్ల రీ–సైక్లింగ్ బిన్‌లను ఏర్పాటు చేశామని తెలిపారు. పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్ఆర్‌కే ప్రసాద్ మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంపొందించడంలో విద్యార్థులు ముఖ్యపాత్ర పోషించాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ నజీమాబేగం, ఎకో క్లబ్ సభ్యులు డాక్టర్ కె.సరోజ, పి. నాగసుశీల, వై.అనిత కుమారి పాల్గొన్నారు.